క్లుప్తంగా

ఆరోగ్యంపై అవగాహన

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అర్బన్ హెల్త్ సెంటర్ అధికారి డాక్టర్ ఎంవీఆర్ మూర్తి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ చెడు వ్యసనాల వల్ల ఊపిరితిత్తులు పాడై ప్రాణాంతక ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఆరోగ్యపరమైన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలై, బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్, రెడ్ రిబ్బన్ క్లబ్ హెడ్ డాక్టర్ యు.రమేష్, డాక్టర్ కె.దుర్గారావు, టి.కాంచన, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

బ్రాండ్ అంబాసిడర్లుగా ఎంపిక

ప్రకాశం నగర్: బీచ్ వాలీబాల్ నేషనల్ చాంపియన్స్ విజేతలైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన శ్రీలలిత, లావణ్య అధురం ఆంధ్రకు బ్రాండ్ అంబాసిడర్లుగా ఎంపికయ్యారు. ఈ విషయాన్ని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి కె.యశ్వంత్ మంగళవారం సాయంత్రం ప్రకటనలో తెలిపారు. క్రీడాకారిణుల ఎంపికపై అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ


పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో లజపతిరాయ్. చిత్రంలో దాత కిరణ్‌కుమార్ తదితరులు

కడియం: దుళ్ల ప్రాథమిక పాఠశాల1లోని విద్యార్థులకు మంగళవారం ఆ గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కంటిపూడి కిరణ్‌కుమార్ 600 నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ మేరకు స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈవో వి.లజపతిరాయ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఏటా విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేయడంతో పాటు, గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కిరణ్ కుమార్‌ను అభినందించారు. కిరణ్ కుమార్‌తో పాటు, ఆయన తండ్రి బాల మాస్టారును శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, స్కూలు చైర్మన్ వీరబ్రహ్మం, హైస్కూలు కమిటీ డైరెక్టర్ కంటిపూడి సాయి, ఉపాధ్యాయులు అన్నెం దొరబాబు, చల్లా బుజ్జి పాల్గొన్నారు.

రైలు ఆలస్యంతో ప్రయాణికుల అవస్థలు

రాజమహేంద్రవరం సిటీ: తిరుపతి – కాకినాడ మధ్య తిరిగే 17250 నంబరు గల రైలు ఆరు గంటలు ఆలస్యంగా నడిచింది. మంగళవారం మధ్యాహ్నం 3.55 గంటలకు రాజమహేంద్రవరం చేరుకోవాల్సిన రైలు రాత్రి 9.20 గంటలకు వచ్చింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నేడు రైల్ కోచ్ రెస్టారెంట్ ప్రారంభం



సిద్ధమైన రైల్వేకోచ్ రెస్టారెంట్

రాజమహేంద్రవరం సిటీ: దక్షిణ మధ్య రైల్వే రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన రైల్ కోచ్ రెస్టారెంట్‌ను బుధవారం రైల్వే అధికారులు ప్రారంభించనున్నారు. సుమారు 25 ఏళ్ల పాటు వినియోగించిన ఏసీ కోచ్‌ను గోదావరి ఫుడ్ ఎక్స్‌ప్రెస్ పేరుతో రెస్టారెంట్‌గా తయారు చేశారు. దీనిలో సుమారు 50 మంది కూర్చునే ఆహారం తినే వీలు ఉంది. ఇండియన్, చైనీస్, తందూరి, టీ, కాఫీ, జ్యూస్, బిర్యానీ తదితర వెజ్, నాన్‌వెజ్ వంటకాలను ప్రత్యక్షంగా వండి, ఆహార ప్రియులకు అందజేస్తారు.

దాడి ఘటనపై కేసు

కంబాలచెరువు: స్థానిక సింహాచల్ నగర్‌కు చెందిన హిజ్రాలపై సోమవారం రాత్రి జరిగిన దాడి సంఘటనపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఒక యువతితో వ్యభిచారం చేయించాలంటూ హిజ్రాలకు కొందరు చెప్పడం, వారు కాదనడంతో ఘర్షణ చోటుచేసుకోగా అందులో హిజ్రా గాయపడింది. బాధితురాలు పద్మ ఫిర్యాదు మేరకు పోలీసులు మరియమ్మ, ఆమె కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేశారు.

వ్యక్తి అదృశ్యం

ఆల్కాట్ గార్డెన్స్‌కు చెందిన కరుణాకర్ అదృశ్యమైన సంఘటనపై రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. తన కుమారుడు గత నెల 12 నుంచి కనిపించడం లేదని తల్లి చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

రామదాసుపేటలో..

రామదాసుపేటకు చెందిన సమత అదృశ్యమైన సంఘటనపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. తన అక్క ఈనెల 27న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని చెల్లెలు అజిత పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ముందస్తు చర్యలతో ముంపునకు చెక్

- అధికారుల అప్రమత్తతపై హర్షం
- ఊపిరి పీల్చుకున్న బొమ్మూరు, హుకుంపేట వాసులు

రాజమహేంద్రవరం రూరల్: గోదావరి వరద నేపథ్యంలో అధికారులు చేపట్టిన ముందస్తు చర్యలతో బొమ్మూరు, హుకుంపేట గ్రామాల్లో ముంపు ముప్పు తప్పింది. గోదావరి ప్రవాహం ఉధృతంగా ఉండడంతో గతేడాది సెప్టెంబర్‌లో మాదిరిగానే బొమ్మూరు నేతాజీ నగర్, హుకుంపేట సావిత్రీ నగర్ తదితర ప్రాంతాలు నీటమునిగిన విషయం తెలిసిందే. గత వారం రోజులుగా గోదావరి వరద ఎక్కువగా ఉండడంతో మళ్లీ అదే పరిస్థితి నెలకొంటుందని అందరూ భావించారు. అయితే ముందస్తుగా రాజమహేంద్రవరం నగరపాలకసంస్థ కమిషనర్ దినేష్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి జె.సత్యనారాయణ, ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు ధవళేశ్వరం సాయిబాబాగుడి వద్ద రాజమహేంద్రవరం నగరం నుంచి వచ్చే మురుగునీరు హుకుంపేట, బొమ్మూరు మీదుగా గోదావరిలో కలిసే ప్రాంతాన్ని పరిశీలించారు. గోదావరి ప్రవాహం పెరిగితే బొమ్మూరు నేతాజీ నగర్, హుకుంపేట సావిత్రీ నగర్ తదితర ప్రాంతాలు నీట మునిగే అవకాశాలు ఉన్నాయని గ్రహించారు. నేతాజీ నగర్ ప్రధాన వీధిలో కొద్దిగా, హుకుంపేట సావిత్రినగర్‌లో పలు వీధులు, డీమార్టు వెనుక రోడ్డు పూర్తిగా మునిగాయి. దీంతో నగరపాలకసంస్థ అధికారులు ధవళేశ్వరం సాయిబాబాగుడి వద్ద మోటార్లను ఏర్పాటు చేసి నాలుగు రోజులుగా మురుగునీటిని గోదావరిలోకి తోడడం వల్ల ముంపు సమస్యకు చెక్ పడింది. మునిగిన వీధులు సైతం నెమ్మదిగా తేరుకున్నాయి. గోదావరి ప్రవాహం కూడా తగ్గడంతో రెండు రోజుల్లో మొత్తంనీరు లాగే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ముంపు సమస్య కొద్దిగా మాత్రమే ఉండడంతో అటు ప్రజలు, ఇటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.


వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

వరద బాధితులకు దుప్పట్ల పంపిణీ

వరద బాధితులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటోందని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం గోదావరి లంక గ్రామాల ప్రజలకు ఆయన సొంత నిధులతో దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ మాట్లాడుతూ వరద ఉధృతితో కేతావారి లంక, వేదుమల్ల లంక, బ్రిడ్జి లంక ప్రాంతాలు ముంపునకు గురి కావడంతో అక్కడి ప్రజలకు మున్సిపల్ కల్యాణ మండపంలో పునరావాసం కల్పించారన్నారు. వారందరికీ భోజనాలు, టిఫిన్లు, స్నాక్స్‌ను ప్రభుత్వ అధికారులు అందజేస్తున్నారన్నారు. వైద్యశిబిరం ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. పునరావాస కేంద్రాన్ని సందర్శించినప్పుడు 300 మందికి దుప్పట్లు అందించాలని మత్స్యకారులు కోరడంతో వారికి దుప్పట్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర, శెట్టిబలిజ, గౌడ, ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను, జేసీఎస్ కన్వీనర్ రాజమౌళి , అంగాడ సత్యప్రియ, పడమట కామరాజు, షేక్ ఇమామ్ (బాబ్జీ), మేడపాటి కృష్ణారెడ్డి, చల్లా ప్రసాద్, సోము, పెయ్యల రాజేష్, తీగిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.


ధవళేశ్వరం సాయిబాబాగుడి వద్ద మురుగునీరు తోడే మోటార్


హుకుంపేట సావిత్రీనగర్‌లో ముంపు నుంచి బయటపడిన రోడ్డు


డీమార్టు వెనుక రోడ్డులో ముంపునీరు

వైద్య సిబ్బంది సమస్యలపై వినతి

కంబాలచెరువు: జిల్లా వైద్య విధాన పరిషత్‌లోని సుమారు 29 ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది సమస్యలపై జిల్లా వైద్యసేవల సమన్వయ అధికారి డాక్టర్ సనత్ కుమార్‌కి ఏపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆసుపత్రులకు సంబంధించిన కార్యాలయాలలో జరుగుతున్న పనితీరుపై సమీక్షించాలని, తప్పుఒప్పులు సవరించాలని, కొంతమంది సిబ్బందికి రావాల్సిన బకాయి బిల్లులు, వీటిలో ముఖ్యంగా 2022, 23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సరెండర్ లీవ్ నగదు చెల్లింపుల విషయంలో జరుగుతున్న జాప్యంపై మాట్లాడినట్లు ఆ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రవికుమార్ తెలిపారు. వైద్యవిధాన పరిషత్‌లో సిబ్బందికి సంబంధించిన ఎలాంటి ప్రపోజల్ అయినా ఆయా కార్యాలయాల నుంచి వెంటనే తమ కార్యాలయాలకు రప్పించుకుని మంజూరు చేయాలన్నారు. వీటిపై డాక్టర్ సనత్ కుమారి సానుకూలంగా స్పందించారన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ విజయలక్ష్మి, సీహెచ్ రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ర్యాలీ



రాజమహేంద్రవరంలో ర్యాలీ చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చుకుంటే ఈనెల 10 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ యాక్షన్ కమిటీ రాజమహేంద్రవరం జోన్ చైర్మన్ వీవీఎస్ నాగేశ్వరరావు అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం రూరల్, రామచంద్రపురం, అమలాపురం, జగ్గంపేట, కాకినాడ, రంపచోడవరం , పెద్దాపురం డివిజన్లకు చెందిన సుమారు వెయ్యి మంది ఉద్యోగులు మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో రాజమహేంద్రవరం గోదావరి గట్టున గల ఏపీఈపీడీసీఎల్ సర్కిల్ కార్యాలయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. జేఏసీ చైర్మన్ నాగేశ్వరరావు, సెక్రటరీ జనరల్ రత్నాలరావు, కన్వీనర్ రాజారత్నం ఆధ్వర్యంలో ఉద్యోగులందరూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు నక్కపల్లి శామ్యూల్, దాట్ల శ్రీధర్ వర్మ, ఉదయ భాస్కర్, డేవిడ్, రత్నాలరావు, సీనియర్ అక్కౌంట్స్ ఆఫీసర్ ఆదినారాయణ మూర్తి పాల్గొన్నారు.

కేసు రికార్డుల పరిశీలన

రాజానగరం: ఒక కేసు దర్యాప్తులో భాగంగా జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులు దుష్యంత్ సింగ్, బీఎస్ షెకావత్ మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌కు వచ్చారు. ఈ స్టేషను పరిధిలో 2015లో జరిగిన ఒక సంఘటనపై చేసుకున్న అప్పీల్‌పై ఇక్కడికి వచ్చారు. అప్పటి సీఐగా విధులు నిర్వర్తించిన శంకర్ నాయక్‌ను ప్రశ్నించారు. ఆ కేసుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కాగా ఈ విషయమై కమిషన్ సభ్యులను వివరణ కోరగా 2015లో జరిగిన ఒక సంఘటనలో తనకు సరైన న్యాయం జరుగలేదంటూ రంపా మోహన్ అనే వ్యక్తి తమకు చేసిన ఫిర్యాదుపై విచారణకు వచ్చామన్నారు. దీనిపై నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆర్యాపురం సత్యనారాయణస్వామి దేవస్థానం అభివృద్ధికి కృషి చేయాలని నూతన పాలక మండలిని రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు కోరారు. ఆ దేవస్థానానికి నూతన పాలక మండలిని నియమిస్తూ సోమవారం దేవదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ధర్మకర్తల మండలి చైర్ పర్సన్‌గా దుంగా మంగాలక్ష్మి, సభ్యులుగా బల్లిపాటి శ్రీనివాస్, రేగుళ్ల అన్నపూర్ణ, సాగరాల దిలీప్ హర్ష, సంసాని దుర్గ, విస్సారపు కాశీ విశ్వనాథం, చొక్కాకుల వెంకట రమణి, రఘుపాత్రుని సాయిబాబు, బాసరబోయిన విజయ శంకర్, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా పానగిపల్లి వెంకట గోపాల రవిబాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో మార్గాని నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరిని సత్యనారాయణస్వామి దేవస్థానం చైర్ పర్సన్ దుంగా మంగాలక్ష్మి, ఆమె భర్త మీరా సురేష్ మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వారికి శాలువా కప్పి నాగేశ్వరరావు, శ్రీహరి అభినందించారు. ఎంపీ భరత్ రామ్ తనపై పూర్తి నమ్మకంతో ఈ పదవిలో నియమించారని, ఆయన నమ్మకాన్ని వమ్ముచేయబోమని మంగా లక్ష్మి అన్నారు.


దుంగా మంగాలక్ష్మి దంపతులను అభినందిస్తున్న మార్గాని నాగేశ్వరరావు, అడపా శ్రీహరి

అకడమిక్ అంశాల్లో అలసత్వం వద్దు

కంబాలచెరువు: అకడమిక్ అంశాలపై అలసత్వాన్ని సహించేది లేదని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం అన్నారు. స్థానిక గాంధీపురం 2 ఉన్నత పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించారు. విద్యార్థుల నోట్ బుక్స్ కరెక్షన్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. కొందరు విద్యార్థులతో పాఠ్య పుస్తకాల్లోని అంశాలను చదివించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు సిలబస్ పూర్తి చేసి, నోట్స్ కరెక్షన్ చేసి, విధిగా సంతకం చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులు నిరంతరం పరిశీలిస్తూ తగు నివేదికలు తమకు అందజేయాలని కోరారు. రాష్ట్రస్థాయిలో ఆన్‌లైన్‌లో పాఠశాలల పర్యవేక్షణ ఉంటోందని, అకడమిక్ అంశాల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాష్ట్ర కార్యాలయం నుంచి ప్రతిరోజు ఏదో ఒక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయునికి వీడియో కాల్ చేస్తున్నారన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న ఫార్మెటివ్ 1 పరీక్షలను పరిశీలించారు. ఆయన వెంట అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, ప్రధానోపాధ్యాయులు ఆర్.సన్యాసిరావు ఉన్నారు.


గాంధీపురం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో అబ్రహం

ట్రాన్స్‌జెండర్ల హక్కులపై అవగాహన

కంబాలచెరువు: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక క్వారీ సెంటర్ వద్ద ట్రాన్స్‌జెండర్ల హక్కులు, సమస్యలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆ సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక హక్కులు ఇచ్చారన్నారు. వారి పట్ల ఎవ్వరూ వివక్ష చూపరాదన్నారు. హక్కులను వినియోగించుకుని ట్రాన్స్‌జెండర్లు అభివృద్ధి సాధించాలన్నారు. వారికి అందించే సబ్సిడీలను వివరించారు. ఎలాంటి సహాయం కావాలన్నా జిల్లా న్యాయసేవాధికార సంస్థ అండగా ఉంటుందన్నారు. దిశ డీఎస్పీ కె.తిరుమలరావు మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లు సాధారణ వారిలానే అన్ని రంగాల్లో అభ్యున్నతి సాధించాలన్నారు. అనంతరం ట్రాన్స్‌జెండర్లకు ఏర్పాటు చేసిన ఉచిత హెల్ప్‌లైన్ 1091 పోస్టర్‌ను ఆవిష్కరించారు.


హెల్ప్‌లైన్ 1091 పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎల్ఎస్ఏ ప్రత్యూష కుమారి

మణిపూర్ ఘటనలపై శాంతి ర్యాలీ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఐఎల్‌టీడీ జంక్షన్‌లోని ఎపిఫానియా లూథరన్, గ్లోరియాడై, బెథెల్ మిషన్ చర్చిలు, బహుజన సమాజ్ పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో క్రైస్తవులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న మారణ కాండను నిరసిస్తూ అక్కడ శాంతి, సమాధానం కలగాలని, క్రైస్తవులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఐఎల్‌టీడీ జంక్షన్ నుంచి కోటిపల్లి బస్టాండ్ వరకూ ఈ కార్యక్రమం జరిగింది. పాస్టర్లు కేతు శ్యాంబాబు, వెల్లింగ్టన్, రాజేష్ కుమార్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయ్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో కోరుకొండ చిరంజీవి, గోడి మోజెస్, నక్కా విజయకుమార్, కలాకర్, సాల్మన్ రాజు, నరేష్, నళిని, చిన్నబాబు పాల్గొన్నారు.

ప్రకాశం నగర్: మణిపూర్‌లో జరుగుతున్న అమానవీయ సంఘటనలకు నిరసనగా జాన్ వెస్లీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. లాలాచెరువులోని హోసన్నా మందిరం నుంచి కార్గిల్ అమర వీరుల పార్కు వరకు వెళ్లి, అక్కడి నుంచి తిరిగి హోసన్నా ప్రార్థన మందిరం చేరుకున్నారు. జాన్ వెస్లీ మాట్లాడుతూ మణిపూర్ ఘటనలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి, దోషులను అదుపులోకి తీసుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నగరానికి మెట్రో సొగసులు



సర్వాంగ సుందరంగా గ్రాండ్ ట్రంక్ రోడ్డు

- చురుకుగా జీఅండ్‌టీ రోడ్డు అభివృద్ధి
- నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహణ

రాజమహేంద్రవరం సిటీ: మెట్రో నగరాల స్థాయిలో రాజమహేంద్రవరాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో అనేక సుందర మార్పులకు నగరపాలక సంస్థ శ్రీకారం చుట్టింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోంది. నగరంలోని లాలాచెరువు నుంచి వై.జంక్షన్ వరకూ గల గ్రాండ్ ట్రంక్ రోడ్డును అత్యాధునికంగా తయారు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసి పనులు ప్రారంభించింది. ఈ గ్రాండ్ ట్రంక్ రోడ్ (జీఅండ్‌టీ రోడ్డు) నిర్మాణంలో భాగంగా సుమారు రూ.7.5 కోట్లతో మొదటి ఫేజ్‌లో 2.1 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జాతీయ రహదారి నుంచి నగరంలో ప్రవేశించే ప్రధాన మార్గాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దేందుకు నగరపాలకసంస్థ యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టింది.

అత్యాధునికంగా..

నగరంలో ప్రధాన రహదారి కావడంతో దీనిని అత్యాధునికంగా తీర్చిదిద్దే చర్యలు చేపట్టారు. ఈ ఏడాది నుంచి ఇదే రోడ్డులో ప్రభుత్వ నూతన మెడికల్ కళాశాల ప్రారంభం కానుంది. దీనితో పాటు ఆర్టీఓ కార్యాలయం, ఫుడ్ కార్పొరేషన్ గిడ్డంగులు, వైద్య విధాన పరిషత్ ఆసుపత్రి, ఆర్‌అండ్‌బీ అతిథి గృహం, స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, సెంట్రల్ జైలు, మంజీరా స్టార్ హోటల్, హోమియోపతి కళాశాల, సెంట్రల్ టుబాకో రీసెర్చ్ ఇనిస్టిట్యూట్.. ఇవన్నీ ఈ మార్గంలోనే ఉన్నాయి. జీఅండ్‌టీ రోడ్డును మూడు ఫేజ్‌ల్లో పూర్తి చేయాలనే లక్ష్యంతో మూడు కిలోమీటర్ల దూరాన్ని ఆధునీకరించేందుకు ప్రణాళిక తయారు చేశారు.

చురుకుగా మొదటి ఫేజ్ పనులు

మొదటి ఫేజ్‌లో 2.1 కిలోమీటర్ల దూరం అంటే ఆర్టీఓ కార్యాలయం నుంచి వై.జంక్షన్ వరకూ ఆధునీకరించేందుకు రోడ్డుకు ఇరువైపులా పనులు ప్రారంభించారు. మిగిలిన పనులను తదుపరి ఫేజ్‌లలో చేపడతారు. రోడ్డు ఆధునీకరణలో భాగంగా సైకిల్ ట్రాక్, పార్కింగ్ ప్లేస్, హాకింగ్ జోన్, ఫుట్ పాట్ , గ్రీనరీ, విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేయనున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై ప్రజలు చెట్లకింద కూర్చునేలా ప్రత్యేక బెంచీలు ఏర్పాటు చేశారు. నగర పాలక సంస్థ పరిధిలో జరుగుతున్న పనులు పూర్తియ్యి, మరో రెండు నెలలో పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోనికి రానుంది.


అభివృద్ధి పనులతో రోడ్డుకు కొత్తందం

రెండు నెలల్లో పనులు పూర్తి



గ్రాండ్ ట్రంక్ రోడ్డు అత్యంత సుందరంగా తయారు కానుంది. రోడ్డు నిర్మాణ పనులు రెండు నెలల్లో పూర్తవుతాయి. మొదటి దశలో 2.1 కిలోమీటర్లు సిద్ధం చేస్తున్నాం. రెండో దశకు నిధులు విడుదలైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. మెట్రోపాలిటన్ నగరాల్లో ఉండే రోడ్డు తరహాలో జీఅండ్‌టీ రోడ్డును సిద్ధం చేస్తున్నాం. ఇది నగరానికి మరింత శోభను తీసుకురానుంది.
– పాండురంగారావు, ఎస్ఈ, నగరపాలక సంస్థ

చోరీ కేసులో ఆరు నెలల జైలు

ధవళేశ్వరం: గ్రామంలోని ఎర్రకొండపై 2021 జూలై 21న జరిగిన చోరీకి సంబంధించి ఇద్దరికి ఆరు నెలల జైలుశిక్ష పడినట్లు ధవళేశ్వరం పోలీసులు తెలిపారు. జెట్టి చిన్ని అనే ఆమె తన కుటుంబ సభ్యులతో కలిసి గోకవరం వెళ్లింది, తిరిగి వచ్చి చూసే సరికి ఇంటి తలుపు తెరిచి బీరువా పగులగొట్టి ఉంది. అందులో సుమారు రూ.9 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, రూ.35 వేలు పోయినట్లు గుర్తించి ధవళేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి, దశరథ బాపిరాజు, పాలిక రామకృష్ణను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. వాదోపవాదనలు అనంతరం జడ్జి సి.రమ్య తీర్పు ఇచ్చారు. నిందితులకు శిక్ష పడేలా చేసిన సీఐ కె.మంగాదేవి, కోర్టు కానిస్టేబుళ్లు రమేష్, సత్తిబాబును అధికారులు అభినందించారు.

బంగారు ఆభరణాల చోరీ

ధవళేశ్వరం: రాజమహేంద్రవరం రూరల్ మండలం రాజవోలు గ్రామంలోని కొత్తపేటకు చెందిన నక్కా నవ్యతేజ్ ఇంట్లో 26 కాసుల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ధవళేశ్వరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంట్లోని లాకర్‌లో పెట్టిన బంగారు ఆభరణాలను గత నెల 30వ తేదిన నక్కా నవ్యతేజ్ తెరచి చూడగా అందులో ఉండాల్సిన కొన్ని బంగారు ఆభరణాలు కనిపించలేదు. 26 కాసుల నెక్‌లెస్, చంద్రహారం, గొలుసులు, కడియం, ఆరు జతల చెవి రింగులు మాయమయ్యాయి. ఈ మేరకు సీఐ కె.మంగాదేవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెడికల్ కళాశాలలో పైపుల మాయం

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నిర్మిస్తున్న భవనాలకు సంబంధించి పైపులు, ఇనుప వస్తువులు చోరీకి గురైన సంఘటనపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. గత నెల 19వ తేదీన కళాశాల భవన నిర్మాణాల వద్ద పైపులు, ఇనుప వస్తువులు చోరీకి గురయ్యాయి. దీనిపై కాంట్రాక్టర్ నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కంప్యూటర్, కుట్టు శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం సిటీ: కంప్యూటర్, మగ్గం, టైలరింగ్ కోర్సులలో శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు లాలాచెరువులోని స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్వాహకులు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఇలాంటి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంప్యూటర్ కోర్సులో చేరేవారు ఇంటర్ ఉత్తీర్ణులవ్వాలని, ఇతర కోర్సుల్లో కనీసం పదో తరగతి చదివిన వారికి అవకాశం ఉంటుందన్నారు. ఆగస్టు 9 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. 45 రోజులపాటు జరిగే ఈ శిక్షణలో మెటీరియల్‌తో పాటు మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తామన్నారు. శిక్షణ అనంతరం ఉత్తీర్ణత పత్రాలను అందిస్తామని తెలిపారు. కంప్యూటర్ కోర్సులో చేరేవారు 81256 86494, టైలరింగ్, ఇతర కోర్సులకు 98498 47489 నంబర్లను సంప్రదించాలన్నారు. అలాగే లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమానికి వచ్చి కూడా వివరాలు తెలుసుకోవచ్చన్నారు.